క్లుప్తంగా

ప్రపంచ అయోడిన్ దినోత్సవం



చెన్నారావుపేట : మండల కేంద్రంలోని పీహెచ్ సీలో ప్రపంచ అయోడిన్ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సులో డాక్టర్ సరోజన మాట్లాడారు. సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ భద్రయ్య, సూపర్వైజర్ సువార్త, హెల్త్ అసిస్టెంట్లు సురేందర్, లింగమూర్తి, స్టాఫ్ నర్స్ హేమలత, ఫార్మసిస్టు లీల, బుజ్జమ్మ పాల్గొన్నారు.

పేద విద్యార్థికి మెడిసిన్‌లో సీటు



దుగ్గొండి : పేద విద్యార్థి ప్రతిభ చాటి మెడిసిన్‌లో సీటు సాధించాడు. వివరాలిలా.. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన మాటేటి సదానందం దంపతులు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. సదానందం దంపతుల కుమారుడు అరుణ్ నీట్ పరీక్ష రాయగా ఇటీవల జరిగిన మూడో రౌండ్ కౌన్సిలింగ్‌లో సూర్యాపేటలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు లభించింది. ఈ క్రమంలో అరుణ్‌ను మాజీ సర్పంచ్ ఇంగోళి రాజేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ హింగె రామారావు, సొసైటీ చైర్మన్ ఊరటి మహిపాల్‌రెడ్డి, యూత్ ఫర్ స్వచ్ఛ్ దుగ్గొండి వ్యవస్థాపకుడు శానబోయిన రాజ్‌కుమార్ సోమవారం అభినందించారు.

టీపీటీఎఫ్ కమిటీ ఎన్నిక



మల్లికార్జున్



రమేశ్

పర్వతగిరి : మండల కేంద్రంలో టీపీటీఎఫ్ మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ హాజరు కాగా ఎన్నికల అధికారిగా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.మనోజ్, ఎన్నికల పరిశీలకుడిగా జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు వ్యవహరించారు. అధ్యక్షుడిగా పిండి మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా దోరం రమేశ్, ఉపాధ్యక్షులుగా సింగారపు భిక్షపతి, కె.వెంకటేశ్వర్లు, టి.దుర్గాదేవి, కార్యదర్శులుగా బాదావత్ రాజు, డి.కమలాకర్, జిల్లా కౌన్సిలర్లుగా పి.సురేశ్, బి.ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లికార్జున్, రమేశ్ మాట్లాడారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిబద్ధతతో పని చేస్తామన్నారు. కామన్ స్కూల్ విద్యా విధానం కోసం పోరాడతామని తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా అన్వర్

వర్ధన్నపేట : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా అన్వర్‌ను ఎన్నుకున్నట్లు మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతు జ్యోతిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆమె అన్వర్‌కు సోమవారం పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అన్వర్ మాట్లాడారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల సాంబరావు, జిల్లా అధ్యక్షుడు నందగిరి రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

రాయపర్తి : మండలంలోని కాట్రపల్లి గ్రామ పంచాయతీ కార్మికుడు గాదరి యాకయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.10 వేల నగదును పంచాయతీ కార్యదర్శి రాజేందర్ సోమవారం అందజేశారు. తొలుత యాకయ్య మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది కుమార్, మోతె వెంకన్న, కుతాటి జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

గిర్నిబావిలో..

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావికి చెందిన చెల్పూరి రమేశ్ తల్లి లక్ష్మి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి స్థానిక నాయకులతో కలిసి రూ.2 వేల నగదుతోపాటు క్వింటా బియ్యం సాయంగా అందజేశారు. తొలుత లక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెండ్లి వెంకటేశ్వర్లు, నాయకులు అనుముల రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లికి చెందిన బొమ్మెర వెంకన్న ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎస్ఆర్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. అనంతరం రూ.5 వేల నగదుతోపాటు 50 కేజీల బియ్యం, వంటసామగ్రి అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ నాయక్, ఫౌండేషన్ ప్రతినిధులు మధూకర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి చేయండి

● డీసీఈబీ సెక్రటరీ కృష్ణమూర్తి

రాయపర్తి : విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డీసీఈబీ సెక్రటరీ గారె కృష్ణమూర్తి కోరారు. మండలంలోని కొండూరు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని కొండూరు, తిర్మలాయపల్లి హైస్కూళ్లతోపాటు కేజీబీవీని సోమవారం ఆయన సందర్శించారు. సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ-1) పరీక్షను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడారు. విద్యార్థులు పరీక్షల పట్ల ఆందోళన చెందకుండా ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు పద్మలత, కవిత, సతీశ్, రజనీకాంత్, మల్లేశం, సీఆర్పీలు పాల్గొన్నారు.



రాయపర్తి : పరీక్షలను పరిశీలిస్తున్న కృష్ణమూర్తి



ఖానాపురం : మాట్లాడుతున్న ఏఎంఓ సృజన్‌తేజ

పరీక్షలకు హాజరు తప్పనిసరి

చెన్నారావుపేట/సంగెం/ఖానాపురం : సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఉండ్రాతి సుజన్ తేజ స్పష్టం చేశారు. చెన్నారావుపేట, సంగెం, ఖానాపురం మండలాల్లోని పలు పాఠశాలలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయుల డైరీ, విద్యార్థుల హాజరు రిజిస్టర్లు, ఎఫ్ఎల్ఎస్ ప్రోగ్రాం రికార్డులు, బేస్ లైన్, లిప్ పరీక్షల రిపోర్టులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. డిసెంబర్‌లో జరగనున్న న్యాస్ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలని చెప్పారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు జీపీఏ సాధించేలా కృషి చేయాలన్నారు. విద్యార్థులతో జాతీయ నాయకుల జీవితగాథలు రాయించి 'వీర్‌గాథ-4.0'లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేలా ఉన్న వ్యాసాలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమాల్లో ఎంఈఓలు బైరి సరళ, ఎంఈఓ సాంబయ్య, హెచ్ఎంలు హిరణ్మయి, అరుంధతి, ఉపాధ్యాయులు జగన్‌మోహన్, నాగేంద్రచారి, జ్యోతి, ఈర్య, కుమారస్వామి, రవి, యశోద, రజిత, తేజస్విని, స్వప్న, ఎంఆర్సీ సిబ్బంది అశోక్, స్వప్న, సీఆర్పీలు రమేశ్, సంపత్, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి



గీసుకొండ : మాట్లాడుతున్న విజయచందర్‌రెడ్డి

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి

సంగెం : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి కోరారు. మండలంలోని వంచనగిరిలో ఆయన ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికీ తిరుగుతూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా విజయ్‌చందర్‌రెడ్డి మాట్లాడారు. అన్ని బూత్‌ల్లో 200కు తగ్గకుండా సభ్యత్వాలు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మగడ్డ జాన్ విక్రమ్, జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్, నాయకులు పసునూటి అనిల్, బొల్లం అనిల్, రాజేష్, గోక అనిల్, వంశీ, భాస్కర్, భరత్, బిక్షపతి, సుమన్, రవికుమార్, కేదారి పాల్గొన్నారు.



సంగెం : మాట్లాడుతున్న కాళీప్రసాద్‌రావు

పల్లారుగూడ, వీఆర్ఎస్ తండాలో..

సంగెం : మండలంలోని పల్లారుగూడ, వీఆర్ఎస్ తండాల్లో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కాళీప్రసాద్‌రావు పర్యవేక్షించి మాట్లాడారు. లక్ష్యానికి మించి సభ్యత్వ నమోదు జరగాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. శ్రేణులు నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీ, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు పగడాల రాజ్‌కుమార్, కార్యదర్శులు కూతురు రాజు, మొలుగూరి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి భూక్య వెంకన్న, నాయకులు చంద్రమౌళి, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



ఎమ్మెల్యేకు పూలబొకే అందజేస్తున్న జర్నలిస్టులు

వర్ధన్నపేట : వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్ నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూలబొకే అందజేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎమ్మెల్యే అభినందించి మాట్లాడారు. జర్నలిస్టులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. విలువలతో కూడిన జర్నలిజం పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. జర్నలిస్టులు ప్రజాసమస్యలు వెలుగులోకి తీసుకొస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు జర్నలిస్టులకు అందేలా చొరవ తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కమిటీ గౌరవ అధ్యక్షుడు ఐత ప్రవీణ్‌కుమార్, అధ్యక్షుడు మల్లెపాక కుమార్, ప్రధాన కార్యదర్శి నాంపల్లి మల్లేశం, ఉపాధ్యక్షులు బుర్ర వెంకటరమణ, మునుకుంట్ల దేవేందర్, కార్యదర్శి బండారి విక్రమ్, కోశాధికారి పిట్టల భాస్కర్, ప్రచార సమన్వయకర్త పసునూరి మురళి, ముఖ్యసలహాదారు బిర్రు కరుణాకర్, కార్యవర్గ సభ్యులు గడ్డ నాగరాజు, కత్తి వేణుకుమార్, రాజకొమురయ్య, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



దుగ్గొండి : వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలోని గిర్నిబావిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా.. గీసుగొండ మండలంలోని దస్రుతండాకు చెందిన కేలోతు సునీత ఆదివారం గిర్నిబావికి వచ్చి ఇంటికి వెళ్లే క్రమంలో కూరగాయలు కొనేందుకు బస్టాండ్ సెంటర్‌కు వెళ్లింది. అనంతరం కనిపించలేదు. సునీత కోసం ఆమె పుట్టింటి వద్ద, బంధువుల ఇళ్లలో వెదికినా కనిపించకపోవడంతో ఆమె భర్త రవి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. సునీత వయసు 28 సంవత్సరాలు ఉంటుందని, నీలం రంగు చీర, జాకెట్ ధరించి ఎరుపు రంగులో కోల ముఖం కలిగి ఉంటుందని ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఆమెకీ తెలిసిన వ్యక్తులు సెల్ నంబర్ 8712685232 లేదా 8712685022కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

అభివృద్ధిలో ఆర్థిక అక్షరాస్యత కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కరాచారి

నర్సంపేట రూరల్ : వ్యక్తుల అభివృద్ధిలో ఆర్థిక అక్షరాస్యత కీలకమని ధరణి స్వచ్ఛంద సంస్థ చైర్‌పర్సన్ క్లైపు శోభారాణి, లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్‌సీ యూనియన్ బ్యాంక్ కౌన్సిలర్ భాస్కరాచారి స్పష్టం చేశారు. మండలంలోని రాజుపేటలోని రైతువేదికలో సోమవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రజలు సంపాదించిన డబ్బులో కొంత పొదుపు చేసుకోవడాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తద్వారా భవిష్యత్‌లో ఎదురయ్యే అవసరాలకు ఇబ్బంది లేకుండా చూసుకోవచ్చని చెప్పారు. కుటుంబాల సామాజిక భద్రత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, తదితర పథకాలను వినియోగించుకోవాలని కోరారు. ప్రతిఒక్కరూ బ్యాంకులో ఖాతా కలిగి ఉండడంతోపాటు ప్రభుత్వ బీమా పథకాల్లో చేరి కుటుంబాలకు భరోసా కల్పించాలని చెప్పారు. సిబిల్ స్కోర్ మెరుగ్గా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనవసరమైన ఖర్చులు తగ్గించుకుని పెద్ద మొత్తంలో డబ్బు పొదుపు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయి, స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ఈదునూరి రమేశ్, ఎస్‌బీఐ మేనేజర్ రమేశ్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ వినోద్‌కుమార్, సంస్థ కోఆర్డినేటర్ ముబీన్ ఖాన్, ఫీల్డ్ ఆఫీసర్ సౌజన్య, శ్వేత పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలు జయప్రదం చేయండి

నర్సంపేట : ఈనెల 31న మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ వేడుకలు జయప్రదం చేయాలని సివిల్ సప్లై హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ కోరారు. పట్టణంలోని సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ గోదాం ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా యూనియన్ పోరాడుతోందని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అక్కపల్లి రమేశ్ మాట్లాడారు. సమావేశంలో నాయకులు నర్సింగం, మల్లయ్య, మహేందర్, రవి, కుమారస్వామి, కిశోర్, వీరస్వామి, కుమార్ పాల్గొన్నారు.

క్రీడాకారుల అభివృద్ధికి ప్రాధాన్యం



అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న శ్రీనివాస్

నర్సంపేట : క్రీడాకారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ కమిటీ కన్వీనర్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పులూరి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. జిల్లా ప్రైవేటు వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు నాడెం సంతోశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి యాట రవికుమార్‌లను పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ సెక్రటరీ సోనబోయిన సారంగపాణి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి ఈసాల లక్ష్మయ్య, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి భానోత్ దేవీలాల్, నర్సంపేట డివిజన్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘంతో కలిసి శ్రీనివాస్‌గౌడ్ సన్మానించారు. అనంతరం నిర్వహించిన అభినందన సభలో శ్రీనివాస్ మాట్లాడారు. జిల్లాలో వ్యాయామ విద్య అభివృద్ధి, క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధి కోసం అసోసియేషన్ పని చేయాలి కోరారు. కార్యక్రమంలో ప్రైవేటు వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పరికి ప్రశాంత్, క్రీడా కార్యదర్శులు ఈక కృష్ణ, వజ్జ రాజేశ్, ఉడుతల శ్రీకాంత్, శేఖర్‌యాదవ్, వెంకటరత్నం, నర్సింహరాములు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం



బహుమతి అందుకుంటున్న కింగ్స్ టీమ్

నర్సంపేట : క్రీడలతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని ప్రముఖ వైద్యుడు రమేశ్ తెలిపారు. పట్టణంలోని సర్వాపురంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన అతిథిగా పాల్గొని ఫైనల్స్‌లో మొదటి బహుమతిని స్కైరాపర్స్‌కు, ద్వితీయ బహుమతిని కింగ్స్ జట్టుకు అందజేసి మాట్లాడారు. యువత క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. మొదటి, ద్వితీయ బహుమతులు అందుకున్న స్కైరాపర్స్, కింగ్స్ జట్లను అభినందించారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని చెప్పారు. ఓటమి పొందిన జట్లు నిరాశ చెందకుండా క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, కిరణ్, బైరి విజయ్, అజయ్, రాము, అదులాపురం అనిల్, దుబ్బాక నర్సింహారెడ్డి, వరుణ్, రాము, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

నల్లబెల్లి : జమనాతు ఉన్న కారణంతో అప్పు చెల్లించాలన్న వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న చిరువ్యాపారి మాదంశెట్టి రాము కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా కోశాధికారి గందె శ్రీనివాస్ గుప్తా కోరారు. ఆ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కృష్ణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడారు. విష్ణు అనే వ్యక్తి రిటైర్డ్ టీచర్ వద్ద అప్పు తీసుకుని ఐపీ పెట్టగా రాము జమానతు ఉండడంతో వేధింపులకు గురి చేయడంతో వడ్డీ చెల్లించాడని చెప్పారు. వేధింపులు ఎక్కువ కావడంతో రాము ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు నీల వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి శ్రీనివాస్, నల్లబెల్లి అధ్యక్షుడు మురికి రవీందర్, కోశాధికారి మురికి మనోహర్, నాయకులు ఎలగందుల వీరయ్య, పురం సతీశ్, రామిని నాగరాజు, బచ్చు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత మహిళలకు అండగా 'సఖి'

వర్ధన్నపేట : సఖి కేంద్రాలతో బాధిత మహిళలకు సాంత్వన లభిస్తుందని లీగల్ కౌన్సిలర్ శోభారాణి, కేస్ వర్కర్ తిరుమల తెలిపారు. మండలంలోని బండౌతాపురం, ఇల్లంద గ్రామాల్లో గ్రామైఖ్య సంఘాల మహిళలకు సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. సఖి-వన్ స్టాప్ సెంటర్‌లో అందుతున్న సేవలను వివరించారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్‌స్టాప్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. విడిపోయే భార్యాభర్తలకు కౌన్సిలింగ్, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, గర్భ విచ్ఛిత్తి తదితరాల వేధింపులకు సంబంధించిన సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. మహిళలు, బాలికలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా సఖి కేంద్రం పని చేస్తోందని వివరించారు. సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు కౌన్సిలింగ్ చేయడంతోపాటు న్యాయ, పోలీస్, వైద్య, తాత్కాలిక వసతి సదుపాయాలు లభిస్తాయని చెప్పారు. బాధిత మహిళలు, బాలికలు టోల్ ఫ్రీ నెంబర్లు 100, 181, 1098, 14567లకు ఫోన్ చేయాలని సూచించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో మహిళలకు సఖి సేవల గురించి వివరించాలని కోరారు.

మహిళల సంక్షేమం సామాజిక బాధ్యత



చెక్కు అందజేస్తున్న సీఐ మహేందర్

సంగెం : మహిళ సంక్షేమాన్ని సామాజిక బాధ్యతగా గీసుకొండ సీఐ మహేందర్ అభివర్ణించారు. మండలంలోని కొనాయిమాకులలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళ సంఘాల నాయకులకు సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం వ్యవస్థలు, చట్టాలు సమర్థవంతంగా పని చేస్తున్నాయని చెప్పారు. మహిళలు చట్టాలు, వ్యవస్థలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమస్యల్లో ఉన్న మహిళలను గుర్తించి వారికి సాయం అందించడం పట్ల సర్వోదయ ఆర్గనైజేషన్ ప్రతినిధులను అభినందించారు. మహిళకు ఆర్థికసాయం చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సర్వోదయ ఆర్గనైజేషన్ కార్యదర్శి పల్లెపాడు దామోదర్, చింతలపల్లి మాజీ ఉపసర్పంచ్ బండి రాధిక, నాయకులు గుర్రం గీత, ప్రాజెక్టు మేనేజర్ కవిరాజ్, ఇందిర, రవీందర్, అక్తర్, వనిత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా నర్సిరెడ్డి గెలుపే ధ్యేయం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అన్నాదేవి, నాయకులు

● యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు అన్నాదేవి

నల్లబెల్లి : వరంగల్, నల్గొండ, ఖమ్మం నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డి గెలుపు కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు అన్నాదేవి కోరారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు, ప్రచార కార్యక్రమాలను సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. నవంబర్ 6 వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అర్హులైన ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్య పరిష్కారం, హక్కుల సాధనే లక్ష్యంగా ఫెడరేషన్ ముందుకు సాగుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఫెడరేషన జిల్లా కోశాధికారి రవూఫ్, మండల అధ్యక్షుడు కత్తి కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి రాజిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోవాలి

రాయపర్తి : అర్హులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు కోసం దరకాస్తు చేసుకోవాలని ఏపీయూఎస్, టీపీయూఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు తీగుల్ల సాయిరెడ్డి కోరారు. మండలంలోని కాట్రపల్లి, కొండూరు, రాయపర్తిల్లోని స్కూళ్లను, ప్రభుత్వ కళాశాలలను ఆయన ఆధ్వర్యంలోని బృందం సోమవారం సందర్శించి ఆన్‌లైన్ నమోదుపై అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా సాయిరెడ్డి మాట్లాడారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఫామ్-19 వినియోగించాలని, ప్రధానోపాధ్యాయులు లేదా ప్రిన్సిపాల్ సంతకం చేసిన సర్వీస్ సర్టిఫికెట్ కాపీతోపాటు ఓటరు ఐడీ, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో జత చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణగౌడ్, నాయకులు ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

సవాల్ విసిరి స్వీకరించని కాంగ్రెస్

● బీఆర్ఎస్ నాయకుల మండిపాటు

పర్వతగిరి : కాంగ్రెస్ నాయకులు బహిరంగ చర్చకు సవాలు విసిరి స్వీకరించ లేదంటూ బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ మనోజ్‌గౌడ్ మండిపడ్డారు. రైతు భరోసా కోసం ఆదివారం ధర్నా చేసిన బీఆర్ఎస్ నాయకులను రెచ్చగొట్టేలా బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిందేమీ లేదని, పనులు చేపడితే చూపాలని, చర్చకు సిద్ధమా అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ సవాల్ విసిరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకులు స్థానిక అంబేడ్కర్ సెంటర్‌కు చర్చకు సోమవారం రాగా కాంగ్రెస్ నాయకులు రాలేదు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేశ్వర్‌రావు, మనోజ్ గౌడ్ మాట్లాడారు. దమ్ముంటే అంబేడ్కర్ సెంటర్ వద్ద చర్చకు రావాలని రెచ్చగొట్టిన నాయకుడు రాలేకపోయారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందని చెప్పారు. కాంగ్రెస్ నాయకుల ఆరోపణలపై తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు యుగంధర్‌రావు, లూనావత్ పంతులు, చింతపట్ల సోమేశ్వర్‌రావు, మాడుగుల రాజు, భానోతు వెంకన్న, ఏర్పుల శ్రీనివాస్, చిన్నపాక శ్రీనివాస్, మాధవరావు, గంధం బాలరాజు, మోహన్‌రావు, గోనె సంపత్, పంజా మహేశ్, చింతల శ్రీనివాస్, సూర అశోక్, దేవేందర్, గోపగాని రాజు, బూర శ్యామ్, బరిగల విజయ, శశిరేఖ, డి.దేవేందర్, భూక్య రవి, గట్టయ్య, సంపత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ కమిటీ ఎన్నిక

చెన్నారావుపేట : ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతాల్ల రమేశ్, జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీని మండలంలోని ఉప్పరపల్లిలో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడుగా వీరేశ్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా రవీందర్, ప్రవీణ్, సుమన్, కార్యదర్శులుగా అజయ్, చిలపాక స్వామి, వెల్దండ మధుకర్, సహాయక కార్యదర్శిగా చిలపాక అనిల్, గౌరవ సలహాదార్లుగా చిలపాక యాకయ్య, బొమ్మెర నరేందర్, భోగి వెంకన్న, నమిండ్ల అనిల్, గూడెల్లి రాజు, బత్తుల కొమ్మాలు, తాటికల్ల కొమ్మాలు, మేకల సాంబయ్య, మంద రాజు, మేడిపల్లి రాజు, చిలపాక రవి, మేకల చిన్నరాజు, మేకల పెద్దరాజు ఎన్నికైనట్టు తెలిపారు.

'రైతుల పేరిట బీఆర్ఎస్ డ్రామా'

వర్ధన్నపేట : రైతుల పేర బీఆర్ఎస్ పార్టీ డ్రామాలకు తెరలేపిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ అన్నారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు భరోసా నిరసన కార్యక్రమాలపై మండిపడ్డారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను రూ.7 లక్షల కోట్ల అప్పుల్లోకి బీఆర్ఎస్ ప్రభుత్వం నెట్టిందని విమర్శించారు. యూత్ కాంగ్రెస్ నాయకుడు కుల్ల యాకాంతం మాట్లాడుతూ బడుగులకు భూములు పంచిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని చెప్పారు. తెలిపారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా నాయకుడు పోశాల వెంకన్న పాల్గొన్నారు.

కోళ్లఫారంలో రేషన్ బియ్యం పట్టివేత



సంగెం : గీసుకొండ మండలంలోని ఎలుకుర్తి హవేలీలో బొమ్మినేని రాజేంద్రప్రసాద్‌రెడ్డికి చెందిన జ్ఞానశ్రీ పౌల్ట్రీఫారంలో రూ.28,750 విలువైన 12.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్టు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసి కోళ్లకు దాణాగా వాడుతున్నట్టు సమాచారం అందడంతో గీసుకొండ పోలీసులతో కలిసి టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ వివరాలు వెల్లడించారు. పౌల్ట్రీఫారం యాజమాని రాజేంద్రప్రసాద్‌రెడ్డి అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసి నూకలుగా మార్చి కోళ్ల దాణాగా వాడుతున్నాడని తెలిపారు. రాజేంద్రప్రసాద్‌రెడ్డిని, రేషన్ బియ్యంను పోలీసులకు అప్పగించినట్టు ఏసీపీ వెల్లడించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ జి.బాబులాల్, సిబ్బంది పాల్గొన్నారు.